# మెగా జాబ్ మేళా - హుజూర్నగర్‌లో భారీ ఏర్పాట్లు










పత్రికా ప్రతినిధి, సూర్యాపేట, అక్టోబర్ 22: గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 25న హుజూర్నగర్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.సూర్యాపేట సమీకృత జిల్లా అధికారుల కార్యాలయంలో ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంజనీరింగ్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటిఐ కళాశాలల ప్రిన్సిపల్స్, కరస్పాండెంట్లతో జరిగిన ముందస్తు సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు పిల్లలను ఉన్నత విద్య చదివిస్తుండగా, అవగాహన రాహిత్యంతో ఉద్యోగ అవకాశాలను అందుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి నల్గొండ జిల్లాలోని నిరుద్యోగ యువతకు మంచి అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత 20 నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా 70 నుండి 75 వేల మందికి కొత్త ఉద్యోగాలు కల్పించామని, పరిశ్రమల ద్వారా మరిన్ని ఉపాధి అవకాశాల కోసం జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులను రాష్ట్రానికి ఆహ్వానిస్తున్నామని చెప్పారు. హుజూర్నగర్‌లో జరిగే మెగా జాబ్ మేళాకు సుమారు 250 ప్రముఖ పారిశ్రామిక సంస్థలు హాజరుకానున్నాయని, ఇప్పటికే క్యూఆర్ కోడ్ ద్వారా 12,500 మంది యువత రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వెల్లడించారు. ఇంకా రిజిస్టర్ చేయని వారు కూడా ఈ మేళాకు హాజరై 5 రెజ్యూమే కాపీలు, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకురావాలని సూచించారు.సింగరేణి కాలరీస్, డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ సహకారంతో ఈ మేళా జరుగనుందని తెలిపారు. హుజూర్నగర్‌లోని స్వర్ణ వేదిక ఫంక్షన్ హాల్‌లో ఉదయం అల్పాహారం, భోజనం, ఇతర సౌకర్యాలు పాల్గొనే వారికి కల్పిస్తున్నట్లు తెలిపారు.జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ, ఈ జాబ్ మేళా సూర్యాపేట జిల్లా మాత్రమే కాకుండా ఉమ్మడి నల్గొండ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఒక చక్కని అవకాశం అని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ డైరెక్టర్ రాజేశ్వర్ రెడ్డి, మంత్రి ఓఎస్డీ ప్రవీణ్ పాల్గొన్నారు. పలువురు ప్రిన్సిపల్స్ మాట్లాడుతూ జాబ్ మేళాకు మంచి స్పందన లభిస్తోందని, సోషల్ మీడియా, ఎస్ఎంఎస్‌ల ద్వారా యువతకు సమాచారం అందిస్తున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ నరసింహ, అడిషనల్ కలెక్టర్ సీతారామారావు, సింగరేణి ప్రతినిధులు శ్రీధర్, చందర్, డీట్ ప్రతినిధి వంశీ, ప్రజా ప్రతినిధులు సరోత్తం రెడ్డి, చెవిటి వెంకన్న యాదవ్, కొప్పుల వేణారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నూతన పంచాయతీ భవనానికి భూమిపూజ





సందేశం టైమ్స్ : సంగారెడ్డి జిల్లాప్రతినిధి 22అక్టోబర్ సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలంలోని మర్వెల్లి గ్రామంలో నూతన పంచాయతీ భవన నిర్మాణానికి ఈ రోజు భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ పట్లోల శివ శరణ్ గారి ఆధ్వర్యంలో నిర్వహించారు.

కార్యక్రమంలో ఎంపీడీఓ మరియు ఏఈ శ్రీ కృష్ణ, మాజీ ఉపసర్పంచ్ బస్వరాజ్, ఆత్మ కమిటీ డైరెక్టర్ పి. సాయిబాబా, మాజీ ఉపసర్పంచ్ జుట్టు నర్సింలు, మాజీ వార్డ్ మెంబర్ మేడకుంద ఆంజనేయులు, మఠం బేసిలింగప్పతో పాటు గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడిన మాజీ సర్పంచ్ శివ శరణ్ గ్రామ అభివృద్ధే తమ లక్ష్యమని, నూతన భవనం నిర్మాణం గ్రామ ప్రజలకు మేలు చేకూరుస్తుందని తెలిపారు. భవన నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అందిన నిధులను పారదర్శకంగా వినియోగించి, త్వరితగతిన పనులను పూర్తి చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

## సునీత మాగంటి భార్య కాదు.. ప్రద్యుమ్న సంచలన ఆరోపణలు ..!



సందేశం టైమ్స్:సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి అక్టోబర్ 22: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సంచలన ట్విస్ట్ వెలుగులోకి వచ్చింది. బీఆర్ఎస్ అభ్యర్థి సునీత మాగంటిపై తీవ్రమైన ఆరోపణలు వెలువడుతున్నాయి. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఏకైక చట్టబద్ధమైన కుమారుడిగా చెప్పుకుంటున్న తారక్ ప్రధుమ్న కోసరాజు ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. సునీత తప్పుడు సమాచారం ఇచ్చారని.. చాలా విషయాలను దాచిపెట్టారని ఆయన లేఖలో ఆరోపించారు. “గోపీనాథ్ 1998 ఏప్రిల్ 29న కోసరాజు మాలిని దేవిని చట్టబద్ధంగా వివాహం చేసుకున్నారు. ఈ వివాహం ఆయన మరణం వరకు కొనసాగింది. డివోర్స్ జరగలేదు. నేను వారి ఏకైక చట్టబద్ధ కుమారుడిని. అయితే సునీత మాగంటి గోపీనాథ్‌తో లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉండేవారు. ఆమెను ఆయన చట్టబద్ధ భార్యగా.. తన పిల్లలను చట్టబద్ధ వారసులుగా తప్పుగా చూపారని ఆరోపణ. ఎన్నికల అఫిడవిట్‌లో కూడా ఇలా తప్పుడు సమాచారం ఇచ్చారు. ఇది ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1951 సెక్షన్ 125ఏను ఉల్లంఘించినట్టు అవుతుంది.” అంటూ తారక్ ప్రధుమ్న లేఖలో పేర్కొన్నారు. ఈ ఆరోపణలకు మద్దతుగా రాజేంద్రనగర్ డివిజన్ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీఓ) 2025 అక్టోబర్ 11న జారీ చేసిన ఆర్డర్‌ను (రిఫరెన్స్ నెం.సి/2100/2025) ఆయన జతచేశారు. ఈ ఆర్డర్‌లో సునీత తప్పుడు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ పొందారని.. గోపీనాథ్ మొదటి వివాహ విషయాలను దాచిపెట్టారని అన్నారు. దీంతో ఆ సర్టిఫికెట్‌ను (నెం. సి/08/2025-262, తేదీ 04.07.2025) రద్దు చేశారరని.. సునీత గోపీనాథ్ చట్టబద్ధ భార్య కాదని ఆర్డీఓ ధృవీకరించారని తెలిపారు. ప్రస్తుతం అమెరికాలో నివసిస్తున్న తారక్ ప్రధుమ్న.. ఎన్నికల కమిషన్‌కు ఈ లేఖలో అఫిడవిట్ ధృవీకరణ చేయాలని కోరారు. తప్పుడు సమాచారానికి చర్యలు తీసుకోవాలని, అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలన్నారు. అవసరమైతే తాను హైదరాబాద్‌కు వచ్చి సహకరిస్తానని చెప్పారు. ఆర్డీఓ ఆర్డర్, తప్పుడు ఫ్యామిలీ సర్టిఫికెట్, తల్లిదండ్రుల వివాహ ఫోటోలు (1998), తన బర్త్ సర్టిఫికెట్ లేఖకు జత చేశారు. అయితే ఈ ఆరోపణలపై మాగంటి సునీత వైపు నుంచి ఇంకా స్పందన రాలేదు. ఎన్నికల కమిషన్ ఈ విషయంపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి. ఇటీవలి ఎన్నికలలో సునీత ఆస్తుల వివరాలు ప్రకటించారు. ఓటర్ జాబితాలో మోసాల ఆరోపణలపై కోర్టుకు వెళ్లారు. జూబ్లీహిల్స్ నామినేషన్ల స్క్రూటినీ కొనసాగుతున్నవేళ ఈ ఆరోపణలు సంచలనం రేకెత్తిస్తున్నాయి.

## ప్రమాదకర గుంతను జెసిబి సహాయంతో మూసివేత.

### కోహీర్ సబ్- ఇన్స్పెక్టర్ నరేష్.




సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 22అక్టోబర్ సంగారెడ్డి జిల్లా: జహీరాబాద్ నియోజకవర్గంలో కోహిర్ మండల కవేలి నుండి కోహిర్ కు వెళ్లే రహదారి పూర్తిగా గుంతల మయంగా, మారడం తో ప్రమాదాలు ఏర్పడుతున్నాయి అని తెలుసుకున్న కోహీర్ ఎస్ ఐ నరేష్ ప్రమాదాలు అరికట్టెందుకు తనవంతు సహాయంగా కవేలి బ్యాంకు దగ్గర ఏర్పడిన ప్రమాదకర గుంత వల్ల గత కొంతకాలంగా రోడ్డుప్రమాదాలు జరుగుతున్నాయి.ఈ నేపథ్యంలో, స్థానికుల విజ్ఞప్తి మేరకు రాహదారుల భద్రత దృష్టిలో ఉంచుకుని,కోహీర్ ఎస్ఐ నరేష్ స్పందించి వెంటనే జెసిబి సహాయంతో ఆ గుంతను మూసివేసి ప్రమాదాలను నివారించారు. అనంతరం కవేలి టు కోహిర్ తిరిగి వాహనదారులు స్థానిక ఎస్ఐ నరేష్ కు సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## జోగిపేట మార్కెట్ యార్డ్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 22అక్టోబర్: సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలంలోని జోగిపేట మార్కెట్ యార్డ్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

“రైతులకు మద్దతు ధర కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. రైతులు ఎలాంటి మధ్యవర్తుల జోక్యం లేకుండా నేరుగా మార్కెట్‌లో ధాన్యం అమ్ముకునేలా చర్యలు తీసుకుంటున్నాం,” అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆందోల్ మున్సిపాలిటీ 17వ వార్డు మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు, డాకూరి శ్రీనివాస్, డైరెక్టర్ మమ్మద్ కాలి, చిట్యాల మధు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.కేంద్ర ప్రారంభానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు. రైతులు సకాలంలో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్లు సమాచారం.

